





విజయవాడ రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో దీపాలతో 'జై శ్రీరామ్' నామం

• జయ జానకీ నాయక!

ఎటుచూసినా రామ నామమే. ఎవరి నోట విన్నా 'జై శ్రీరామ్' నినాదమే. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా భక్తులంతా సోమవారం శ్రీరాముని సేవలో పునీతులయ్యారు. పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా అన్నిచోట్లా శ్రీరాముని శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిపించారు. కాలనీల్లోనూ, వీధుల్లోనూ జైశ్రీరామ్ జెండాలు ఆవిష్కరించారు. రాత్రి దీపారాధనలు చేశారు. దుర్గమ్మ ఆలయంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అన్నిచోట్లా అన్నదానాలు చేశారు.



నాగాయలంకలో



ఇస్కాన్ టెంపుల్‌లో



బందరులో భక్తుల శోభాయాత్ర



ఒకటే గమనం.. ఒకటే గమ్యం.. ఆంక్షలను లెక్క చేయలేదు. నోటీసులను పట్టించుకోలేదు. తొలగిస్తామన్నా చలించలేదు. విరామం ఎరుగలేదు. విశ్రమించనూ లేదు. వేతన పెంపు కోసం 42 రోజులుగా అలుపూ సొలుపూ లేకుండా సాగుతున్న అంగన్వాడీల పోరాటం మరో దశకు చేరింది. సోమవారం చలో విజయవాడలో భాగంగా జిల్లాల నుంచి బెజవాడకు చేరుకుంటున్న అంగన్వాడీలను పోలీసులు ముందురోజు అర్ధరాత్రి నుంచే ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులకు తెగబడ్డారు. అయినా జిల్లాలు దాటి నగరానికి వచ్చినవారిని బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకోనీయకుండా అరెస్టు చేసి బస్సుల్లో తరలించారు. అందరినీ ఒకచోటకు చేరనీయకుండా బస్సుల్లో.. ఆటోల్లో.. వెతికివెతికి దొరికినవారిని దొరికినట్టు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రభుత్వంలో ఉద్యమాల అణచివేత ఎలా ఉంటుందో తమ పద్ధతిలో చూపారు.


ధర్నాచౌక్‌వద్ద బలవంతపు అరెస్టులు



వృద్ధురాలిని కూడా వదలకుండా..



నిర్బంధాలను తెంచుకుని..



ఆదివారం అర్ధరాత్రి దాటాక ధర్నాచౌక్ వద్దకు గుంపులుగా చేరిన అంగన్వాడీలు

ఆంక్షలను, అడ్డంకులను దాటుకుని వచ్చిన అంగన్వాడీలపై పోలీసుల కర్కశం



అరెస్టు చేసి బస్సులో తరలింపు



బీఆర్టీఎస్ రోడ్డులో అంగన్వాడీల నినాదాలు

- జిల్లాను అష్టదిగ్బంధం చేసిన పోలీసులు
- అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం
- ఈడ్చుకుంటూ లాక్కెళ్లి బస్సుల్లో పడేసిన పోలీసులు
- బస్సుల్లో వేర్వేరు ప్రాంతాలకు తరలింపు
- ఆందోళనకు మద్దతుగా రోడ్డెక్కిన ప్రజాసంఘాలు
- జిల్లా సరిహద్దులు దాటించినా తిరిగొచ్చి మహిళల ఆందోళన

విజయవాడ/సత్యనారాయణపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చిన చలో విజయవాడ పిలుపు ఉద్రిక్తతలకు దారితీసింది. అంగన్వాడీలతోపాటు వారికి మద్దతుగా వచ్చిన ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కనిపించింది. బీఆర్టీఎస్ రోడ్డులోకి ఎవరు నడుచుకుంటూ వచ్చినా పోలీసులు వాహనాల్లోకి ఎక్కించారు. రోడ్డు మొత్తం పోలీసుల వలయంలో ఉండిపోయింది. విజయవాడకు ఉన్న అన్ని ప్రవేశ ద్వారాల వద్ద బారికేడ్లతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అంగన్వాడీలు ఎక్కడ బైఠాయిస్తే ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బీఆర్టీఎస్ రోడ్డులో రాకపోకలు పూర్తిగా ఆపేయడంతో వాహనదారులు రైల్వే క్వార్టర్స్ పక్కన ఉన్న మార్గంలో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

ఆంక్షలను దాటుకుని..

పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా బీఆర్టీఎస్ రోడ్డు మీద అడుగుపెట్టి తీరాలని అంగన్వాడీలు నిర్ణయించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి గాంధీనగరంలోని దీక్షా శిబిరాన్ని కూల్చేసిన తర్వాత ఆ ప్రదేశాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ధర్నా శిబిరాన్ని కూల్చేసిన తర్వాత కొంతమంది అంగన్వాడీలు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరు బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ భవనంలో తలదాచుకున్నారు. ఇంకొందరు వారి బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఉన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చినవారు ఆదివారం రాత్రికే ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. వారిని అరెస్టు చేసి బస్సుల్లో వివిధ ప్రాంతాలకు తరలించారు. తెల్లవారుజామున వచ్చిన అంగన్వాడీలు బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లో ఉండిపోయారు. ఉదయం నుంచి దఫదఫాలుగా సత్యనారాయణపురం చుట్టుపక్కల ప్రాంతాలకు

- మిగతా 6లో



సొమ్మసిల్లి..



సీఐటీయూ కార్యాలయం వద్ద



ధర్నాచౌక్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు



పోలీసులు బలవంతంగా లాక్కెళ్తూ..







అరెస్టులతో ఆపలేరంటూ బస్సుల్లో నుంచే పిడికిలెత్తి నినదిస్తూ..

15,18,255

జిల్లాలో ఓటర్ల సంఖ్య ఇదీ..



- పురుషులు 7,37,394.. మహిళలు 7,80,796, ఇతరులు 65 మంది
- తొలగించిన ఓట్లు 42,424
- పురుషుల కన్నా మహిళా ఓటర్లు 43,402 మంది అధికం
- జిల్లాలో పెరిగిన ఓటర్లు 35,452 మంది
- నేటి నుంచి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు : కలెక్టర్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాలను సోమవారం కలెక్టర్ పి.రాజాబాబు ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,18,255 మంది ఉన్నట్లుగా చూపారు. వీరిలో పురుష ఓటర్లు 7,37,394 మంది, మహిళా ఓటర్లు 7,80,796 మంది, ఇతర ఓటర్లు 65 మంది ఉన్నట్లుగా ఆయన తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఓటర్ల జాబితాల సవరణ అనంతరం సోమవారం ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో జిల్లాలో ఓటర్ల సంఖ్య 15,18,255 మందికి చేరింది. జిల్లాలో 18, 19 సంవత్సరాల వయసున్నవారు నూతన ఓటర్లుగా 28,902 మందిని చేర్చారు. గతేడాది అక్టోబరు నెలలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం ఈనెల 22వ తేదీ వరకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల మార్పులు, చేర్పుల తరువాత 93,074 మందిని నూతన ఓటర్లుగా చేర్చారు. 57,622 మందిని ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. జిల్లాలో పురుష ఓటర్లకన్నా మహిళా ఓటర్లు 43,402 మంది అధికంగా ఉన్నారు

చేర్పులు, మార్పులు, తొలగింపులు ఇలా

ఓటర్ల జాబితాల సవరణలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబరు నెల నుంచి ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమం చేపట్టిన తరువాత నూతన ఓటర్లుగా చేర్చేందుకు ఫారం-6, అడ్రస్ మార్పుల కోసం ఫారం-8 కలిపి 97,554 వచ్చాయి. వాటిలో 93,074 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లుగా గుర్తించారు. 4,480 దరఖాస్తులను తిరస్కరించారు. ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించేందుకు 59,171 దరఖాస్తులు రాగా వాటిలో 57,622 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లుగా గుర్తించారు. 1549 తిరస్కరించారు. పేర్లు దిద్దుబాటు కోసం 41,044 దరఖాస్తులు రాగా, వాటిలో 39,447 దరఖాస్తులను సరిచేశారు. 1597 తిరస్కరించారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్ల జాబితా వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గన్నవరం	133839	143469	15	277323
గుడివాడ	96342	104434	10	200786
పెడన	82245	83524	1	165770
మచిలీపట్నం	93492	100070	12	193574
అవనిగడ్డ	104121	106823	21	210965
పామర్రు(ఎస్సీ)	88815	94340	3	183158
పెనమలూరు	138540	148136	3	286679
మొత్తం ఓటర్లు	**737394**	**780796**	**65**	**1518255**

పెనమలూరులో అత్యధికం

జిల్లాలో పెనమలూరు నియోజకవర్గంలో అత్యధికంగా 2,86,679 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా పెడన నియోజకవర్గంలో 1,65,770 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబరు నెలలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన సమయంలో జిల్లాలో 14,82,803 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితా ప్రకటించే నాటికి ఓటర్ల సంఖ్య 15,18,255కు చేరింది. జిల్లాలో 35,452 మంది ఓటర్లు పెరిగారు.

నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్లు

గతంతో పోలిస్తే తుది ఓటర్ల జాబితాల ప్రకటించిన తరువాత జిల్లాలో 93,074 మంది ఓటర్లు పెరిగారు. గన్నవరం నియోజకవర్గంలో 20,841 మంది, గుడివాడ నియోజకవర్గంలో 13,537 మంది, పెడన నియోజకవర్గంలో 6,975 మంది, మచిలీపట్నం నియోజకవర్గంలో 17,890 మంది ఓటర్లు పెరిగారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 7,932 మంది, పామర్రు నియోజకవర్గంలో 7,788 మంది, పెనమలూరు నియోజకవర్గంలో 18,111 మంది ఓటర్లు పెరిగారు.

ఓటరు జాబితాలను పరిశీలించాలి : కలెక్టర్

జిల్లాలో విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలను ఓటర్లు పరిశీలన చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, 18 సంవత్సరాలు నిండినవారు, ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసే తేదీ వరకు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఒకే ఇంటిలో పదిమంది కన్నా అధికంగా ఓటర్లు 53,183 మంది ఉన్నట్టుగా గుర్తించి బీఎల్‌వోలు ఫారం-8లు 18,441, ఫారం-7లు 1739 స్వీకరించారని, వాటిని పరిశీలన చేసి తగు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నాని కోవర్టులపై ఆరా!

బుద్దా వెంకన్న, చిన్నిలకు బాధ్యత అప్పగించిన టీడీపీ అధిష్ఠానం

- విజయవాడ పశ్చిమలో కమిటీల రద్దుకు సన్నాహాలు
- పశ్చిమ సమన్వయకర్తగా పలు నియామకాలు చేసిన నాని
- డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులుగా పార్టీకి సంబంధం లేనివారు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) విజయవాడ ఎంపీ కేశినేని నాని టీడీపీకి గుడ్‌బై చెప్పినా ఆయన అనుచరులు ఎవ్వరూ ఆయనతో కలిసి అడుగులు వేయలేదు. ఇది ఓ రకంగా చూస్తే టీడీపీ విజయవాడ పార్లమెంటు పరిధిలో ఎంత బలంగా ఉందో చెప్పే అంశంగా కనిపిస్తోంది. కానీ నాని తన కోవర్టులను కావాలనే టీడీపీలోనే ఉంచారన్న అనుమానాలు టీడీపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో టీడీపీని దెబ్బకొట్టే వ్యూహంలో ఇదీ ఒక భాగమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో టీడీపీ తరపున ఏజెంట్లుగా తన వారిని ఉంచే ప్రయత్నమా? లేదా టీడీపీ ఎన్నికల వ్యూహాలను తెలుసుకోవడానికా? అన్న అనుమానాలను టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. కీలకమైన సమయంలో పార్టీని దెబ్బతీసే ఎత్తుగడలో భాగంగా నాని కోవర్టులు పనిచేయవచ్చని వారు పార్టీ పెద్దలకు చెప్పారు. దీంతో విజయవాడ పార్లమెంటు పరిధిలో ముఖ్యంగా విజయవాడ పశ్చిమలో నాని కోవర్టులు ఎవరనే సమాచారం సేకరించాలని పార్టీ అధిష్ఠానం బుద్దా వెంకన్న, కేశినేని చిన్నికి బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం.

- విజయవాడ పశ్చిమలో కీలకమైనా నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా వంటి వారిని టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో టీడీపీలో ఉన్న సమయంలో కేశినేని నాని విజయవాడ పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నారు. సమన్వయకర్త హోదాలో పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో డివిజన్ కమిటీలను నియమించేందుకు ప్రయత్నించారు. డివిజన్ కమిటీల పనితీరును పర్యవేక్షించేందుకు నాలుగైదు డివిజన్లకు ఓ క్లస్టర్ ఇన్‌చార్జిని నియమించారు. అయితే ఈ కమిటీల్లో పార్టీకి సంబంధంలేని వారిని కూడా నియమించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నియామకాలపై బుద్దా వెంకన్న అభ్యంతరం తెలపడంతో కొన్ని డివిజన్‌లకు మాత్రమే నాని కమిటీలను నియమించుకోగలిగారు. ఈ డివిజన్ కమిటీల్లో అత్యధికులు నానికి అనుచరులుగా ముద్రపడ్డారు. తాజాగా ఈ కమిటీలను రద్దు చేయాలని పశ్చిమ టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానానికి విన్నవించారు. త్వరలోనే డివిజన్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జులను రద్దు చేసే అవకాశం ఉంది. మరోవైపు విజయవాడ పశ్చిమ టీడీపీలో సీనియర్ నాయకులు ఉన్నా వారి నడుమ సమన్వయం కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్ వంటి నాయకులు ఎవరికి వారే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి టీడీపీ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తోంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు బుద్దా వెంకన్న సారథ్యంలో నాయకులందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి.

- **విజయవాడ పార్లమెంటు పరిధిలోనూ ప్రక్షాళన**

విజయవాడ పార్లమెంటు పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేశినేని నాని స్థానిక ఇన్‌చార్జులను కాదని సొంత మనుషులను ప్రోత్సహించారు. దీంతో మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్‌లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సమయానికి వీటన్నింటినీ చక్కదిద్ది గాడిన పెట్టే బాధ్యతను కేశినేని చిన్నికి పార్టీ పెద్దలు అప్పగించారు. ఒకటి రెండు రోజుల్లో ప్రక్షాళన మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



ఉద్యమకారులపై..

ఉక్కుపాదం

అంగన్వాడీలు, కమ్యూనిస్టు నేతల ఆగ్రహం



అంగన్వాడీలను వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

అంగన్వాడీల చలో విజయవాడ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. జీతాలు పెంచాలని, జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 40 రోజులకుపైగా అంగన్వాడీలు సమ్మె బాట పట్టారు. సీఎం అహంకార ధోరణిని నిరసిస్తూ సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివస్తున్న అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. మహిళలని కూడా చూడకుండా బలవంతంగా స్టేషన్లకు తరలించారు.



కృష్ణాజిల్లా పమిడిముక్కల స్టేషన్‌లో అంగన్వాడీల ఆందోళన

- మైలవరం స్టేషన్‌లో బాబూరావు నిరాహార దీక్ష
- అరెస్టులు ఖండిస్తూ స్టేషన్ ఎదుట రాస్తారోకో
- నందిగామలో ఆచంట సునీత, కూరపాటి ప్రవీణల అరెస్టు
- వందలాది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సీపీఎం నేతృత్వంలో అంగన్వాడీల ధర్నా
- తిరువూరులో సీఐటీయూ నేతల నిరసనలు

(ఆంధ్రజ్యోతి,విజయవాడ/నందిగామ/మైలవరం/తిరువూరు): అంగన్వాడీల చలో విజయవాడకు ఎన్టీఆర్‌జిల్లా పరిధిలోని గ్రామీణ మండలాల నుంచి తరలివస్తున్న అంగన్వాడీలు, నాయకులపైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారిపై నిర్బంధకాండ ప్రయోగించింది. మైలవరం పట్టణ పరిధిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావును పోలీసులు మైలవరం స్టేషన్‌కు తరలించారు. బాబూరావు ఫోన్‌ను బలవంతంగా లాక్కోవడంతో ఆయన అక్కడికక్కడే స్టేషన్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. బాబూరావుతో పాటు మహిళాసంఘం నేత రమాదేవిని కూడా స్టేషన్‌కు తరలించారు. బాబూరావును స్టేషన్‌కు తీసుకురావటంతో పెద్దఎత్తున అంగన్వాడీలు స్టేషన్‌కు చేరుకుని ఎన్‌హెచ్-30పై రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ స్థంభించిచడంతో పోలీసులు అంగన్వాడీలను చెదరగొట్టారు. మహిళలు అని కూడా చూడకుండా బలవంతంగా ఈడ్చుకువెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపై అంగన్వాడీలు తిరగబడ్డారు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ మండల పరిధిలో పెద్ద ఎత్తున ఆందోళన సాగింది. ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దే రాజ్యలక్ష్మితో పాటు మరో 200 మందికి పైగా అంగన్వాడీలు విజయవాడ వచ్చే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంక్షన్ల వద్ద కాపు కాసిన పోలీసులు అంగన్వాడీలు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరశిస్తూ సీపీఎం నేతృత్వంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువూరులో స్థానికంగా వామపక్ష నేతల ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన నిర్వహించారు.

సీఎం ఇల్లు ముట్టడికి వెనుకాడేది లేదు

- ఆచంట సునీత

జగ్గయ్యపేట రూరల్ : అంగన్వాడీల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికీ వెనకాడేది లేదని రాష్ట్ర టీడీపీ అంగన్వాడీ అధ్యక్షురాలు, రాష్ట్ర తెలుగునాడు మహిళా సాధికార సంస్థ చైర్మన్ ఆచంట సునీత హెచ్చరించారు. సోమవారం చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఆమెను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకుని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1.05 లక్షల మంది 45 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా అణచివేతకు సిద్ధమవటమేనన్నారు. ఆమెతో పాటు కూరపాటి ప్రవీణ, గద్దె రాజ్యలక్ష్మితో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా నేతలకు టీడీపీ విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఫోన్‌లో సంఘీభావం తెలిపి మద్దతు పలికారు.

అంగన్వాడీలపై నిర్బంధం ఆపాలి

- వామపక్ష నేతల నిరాహారదీక్ష

గవర్నర్‌పేట : అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, వారిని చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కరించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. 'జగనన్నకు చెబుతాం' కోటి సంతకాలతో విజయవాడ చేరుకున్న వేల మంది అంగన్వాడీలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావుల నేతృత్వంలో వామపక్ష, టీడీపీ, జనసేన నేతలు, వివిధ కార్మిక సంఘాల నేతలు సోమవారం బందరు రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో నిరాహారదీక్ష చేపట్టారు. అవసరమైతే నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని, కార్మిక సంఘాలు నిర్ణయిస్తే రాష్ట్ర బంద్‌కు సిద్ధమని నాయకులు హెచ్చరించారు. అంగన్వాడీలను వెంటనే విడుదల చేయాలని, చర్చలకు ఆహ్వానించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీపీఐ రామకృష్ణ మాట్లాడుతూ, జగన్ మొండితనం వల్లే అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారన్నారు. జగన్ అహంకార వైఖరితో సమస్యను జటిలం చేశారని అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరితే లక్షమందిని తొలగిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేత రామకృష్ణ

సీపీఎం నేత వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిపై యుద్ధం చేస్తున్నారని అన్నారు. రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు దీక్షకు మద్దతు ప్రకటించారు. మహిళల పట్ల పోలీసులు అనుసరించిన వైఖరి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, అంగన్వాడీల డిమాండ్లు ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. దీక్షకు మద్దతుగా సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు హరికృష్ణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కెవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కె.ప్రసన్న, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ప్రసంగించారు. దీక్షకు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించింది. దీక్షా శిబిరాన్ని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, జనసేన నాయకులు బొలిశెట్టి వంశీకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు.

మీడియాపై పోలీసుల దురుసు ప్రవర్తన

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీల అరెస్టు క్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల వ్యాఖ్యలపై అంగన్వాడీలు మండిపడుతున్నారు. ధర్నా శిబిరం వద్దకు అర్థరాత్రి చేరుకున్న పోలీసులు ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. సమాచారం తెలియడంతో మీడియా అక్కడికి చేరుకుంది. ఫొటోలు తీయవద్దని డీసీపీ విశాల్‌గున్నీ వారిని వారించారు. ఒక ఫొటోగ్రాఫర్‌ను బస్సులోకి ఎక్కించి తర్వాత దించేశారు. ధర్నా శిబిరం తొలగిస్తున్న క్రమంలో ఫొటోగ్రాఫర్ ఫొటో తీస్తుండగా విశాల్‌గున్నీ ఎదుటే మరో పోలీసు కాలర్ పట్టుకుని పక్కకు లాగేశాడు. మొత్తం శిబిరాన్ని తొలగించి ఆ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత డీసీపీ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావిస్తున్నాయి. "ఇది మన సక్సెస్.. దీనిని సెలబ్రేట్ చేసుకోవాలి.. మరో పది గంటలు కష్టపడండి" అని పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన వ్యాఖ్యానించారని అక్కడే ఉన్న అంగన్వాడీలు చెబుతున్నారు. డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న తమను అన్యాయంగా అరెస్టు చేయడమే కాకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

బెయిల్‌పై బాబూరావు విడుదల

ధర్నా శిబిరం వద్ద అరెస్టు చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బాబూరావు సోమవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయన్ను అరెస్టు చేసిన తర్వాత మైలవరం పీఎస్‌కు తరలించారు. ఆయనపై 120(బి), 143, 153, 290, 509 రెడ్‌విత్ 149, 7(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బాబూరావును సోమవారం రాత్రి విజయవాడలోని మూడో చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. పూచీకతు తీసుకున్న అనంతరం కోర్టు బెయిల్‌పై విడుదల చేసింది.

అరెస్టులు అప్రజాస్వామికం

- టీడీపీ, జనసేన నేతల నిరసన

మచిలీపట్నం టౌన్ : కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి అంగన్వాడీలను అరెస్టు చేసి బందరు మండలం తపసిపూడి పోలీసు శిక్షణా కేంద్రంలో అక్రమంగా నిర్బంధించనందుకు నిరసనగా సోమవారం టీడీపీ జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విజయవాడ ఉద్యమానికి వెళ్లకుండా అంగన్వాడీ కార్యకర్తల సంఘం



తపసిపూడి శిక్షణాశాల వద్ద టీడీపీ నేతల నిరసన ప్రదర్శన

నాయకులతో పాటు వేలాది కార్యకర్తలను అరెస్టు చేసి తపసిపూడిలో నిర్బంధించారు. వారికి సరైన భోజన సదుపాయం కూడా లేకుండా ఇబ్బందులకు గురిచేయడాన్ని టీడీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, సీపీఎం నేతలు బి.సుబ్రహ్మణ్యం తదితరులు నిరసన తెలిపారు. అంగన్వాడీల అరెస్టును నేతలు ఖండించారు.

సీఎం జగన్‌కు బుద్ధి ప్రసాదించాలి

- అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

తోట్లవల్లూరు : హక్కుల కోసం పోరాడుతుంటే సీఎం జగన్ నియంతగా వ్యవహరిస్తూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికే విలువ లేకుండా చేస్తున్నారని అంగన్వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. తోట్లవల్లూరులో సోమవారం ఉదయం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అంగన్వాడీలను గృహనిర్బంధం చేయడంతోపాటు ఆటోలు, బైక్‌లపై పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్‌లోనే సీఎంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున అంగన్వాడీలు నినాదాలు చేశారు.



సాయంత్రం 3.30 గంటలకు అందరూ ఇళ్లకు వెళ్లిపోవాలని ఎస్ఐ విశ్వనాథ్ సూచించగా అందుకు వారు నిరాకరించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ విలువలు కాపాడేలా జగన్‌కు బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్‌కు చేతులెత్తి వేడుకున్నారు.

నిర్బంధాలను తెంచుకుని..

(5వ పేజీ తరువాయి)

చేరుకున్నారు. కొంతమంది రామవరప్పాడు, మధురానగర్ రైల్వేస్టేషన్లలో దిగి బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా గ్రూపులుగా విడిపోయారు. ఒక్కో బ్యాచ్ ఒక్కో ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించింది. ధర్నాచౌక్, పటమటలోని బందరు రోడ్డు, చుట్టుగుంట సర్కిల్, రామవరప్పాడు రింగ్, లోబ్రిడ్జి ప్రాంతాల్లో బైఠాయించి నిరసన తెలిపారు.

- చలో విజయవాలో భాగంగా బెజవాడకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేసి ఆర్టీసీ బస్సుల్లో జిల్లాల సరిహద్దుల అవతల వదిలేశారు.
- కృష్ణాజిల్లాలో అరెస్టు చేసిన వారిని మచిలీపట్నంలోని పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి వారిని బస్సుల్లో ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో వదిలేశారు.
- కంకిపాడులో కూలి పనులకు వెళ్తున్న మహిళలను అరెస్టు చేశారు. తాము కూలీలమని చెప్పినా పోలీసులు వినలేదు. బస్సులోకి ఎక్కించి కొంతదూరం తీసుకెళ్లిన తర్వాత వారు కూలీలని నిర్ధారించుకుని వదిలేశారు.
- డీటీసీలో ఉన్న అంగన్వాడీల్లో కొంతమందికి అనారోగ్యం ఉందని, బయటకు పంపాలని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు.

● అరెస్టు చేసుకోండి..

బీఆర్టీఎస్ రోడ్డులోకి వచ్చిన అంగన్వాడీలను పోలీసులు ఉదయం నుంచి అరెస్టు చేస్తున్నారు. ఈ మార్గంలో బందోబస్తును డీసీపీలు విశాల్‌గున్నీ, వేజెండ్ల అజిత, కె.చక్రవర్తి, మోకా సత్తిబాబు పర్యవేక్షిస్తున్నారు. ముగ్గురు అంగన్వాడీ కార్యకర్తలు ఉపేంద్ర చౌక్ నుంచి సీఐటీయూ భవనం వైపునకు నడుచుకుంటూ వచ్చారు. వారిని అరెస్టు చేసి బస్సు ఎక్కించాలని అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వారితో ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతుండగా డీసీపీ విశాల్‌గున్నీ కారులో వెళ్తూ అక్కడ ఆగారు. విషయం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు తమ వద్ద నుంచి సెల్‌ఫోన్లు తీసుకున్నారని, వాటిని ఇవ్వాలని వారు చెప్పారు. ఫోన్ నంబర్లు రాసి ఇస్తే ట్రాక్ చేస్తామని విశాల్‌గున్నీ వారికి చెప్పారు. ఇంతలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బస్సు ఎక్కాలని ఒత్తిడి చేశారు. దీనిపై ఓ అంగన్వాడీ తీవ్రంగా స్పందించింది. 'మమ్మల్ని అరెస్టు చేస్తే చేసుకోండి. ముందు మా సెల్‌ఫోన్లు ఇవ్వండి' అని ఘాటుగా సమాధానం ఇచ్చింది.

● తొలగింపు కత్తి

ఉదయం నుంచి పోలీసులు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అరెస్టు చేయగా, సాయంత్రం నుంచి ఐసీడీఎస్ అధికారులు తొలగింపు ఉత్తర్వులు సిద్ధం చేశారు. కృష్ణాజిల్లాలో 1686 మంది అంగన్వాడీలు, 1537 మంది హెల్పర్లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్‌లోగా 109 మంది అంగన్వాడీలు, 86 మంది హెల్పర్లు విధుల్లో చేరారు. ఎన్టీఆర్ జిల్లాలో 1425 మంది వర్కర్లు, 1475 మంది హెల్పర్లు ఉన్నారు. వారిలో సోమవారం సాయంత్రానికి 150 మంది వర్కర్లు, 146 మంది హెల్పర్లు విధుల్లో చేరారు. 1329 మంది హెల్పర్లు, 1275 మంది వర్కర్లను తొలగిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు.

● లైట్లు తీసేసి బస్సుల్లో ఎక్కించారు

- మంజుల, సంఘం అధ్యక్షురాలు

శిబిరంలో శాంతియుతంగా దీక్షచేస్తున్న మమ్మల్ని అర్థరాత్రి మూడు గంటలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యుత్ నిలుపుదల చేసి ఈడ్చుకుంటూ తీసుకువెళ్లి బస్సుల్లో వేశారు. ఎక్కడకు తరలిస్తున్నారో చెప్పకుండా వాహనాల్లో తిప్పారు. చివరకు మచిలీపట్నంలోని డీటీసీకి తీసువచ్చారు. తాగునీరు, అల్పాహారం, భోజనం పెట్టకుండా, మహిళల ఇబ్బందులను పట్టించుకోకుండా నిర్బంధించారు. బటన్‌నొక్కి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నానని చెబుతున్న సీఎం జగన్‌కు ఎన్నికల్లో బటన్‌నొక్కి బుద్ధిచెప్తాం.

జరిగింది ఇలా ..

- అర్థరాత్రి 2.30 గంటలకు ధర్నాచౌక్‌కు భారీగా చేరుకున్న పోలీసు బలగాలు
- 3.00 గంటలకు అంగన్వాడీల దీక్షా శిబిరంలో విద్యుత్ నిలిపివేత.
- పోలీసుల రాకతో నడిరోడ్డుపై పడుకుని నిరసన
- 3.00 గంటల నుంచి అంగన్వాడీల అరెస్టు, వాహనాల్లో తరలింపు
- 4.00 గంటలకు దీక్షా శిబిరం కూల్చివేత
- ఉదయం 6.00 గంటలకు బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకున్న పోలీసులు
- 7.00 గంటల నుంచి బీఆర్టీఎస్ రోడ్డు మీదకు వచ్చిన అంగన్వాడీలు, ఎక్కడికక్కడ అరెస్టులు
- 10.00 గంటలకు పెరిగిన అంగన్వాడీల రాక



గొల్లపూడిలో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఉమా

బీసీలకు చేసిందేమిటో జగన్ చెప్పాలి : దేవినేని ఉమా

గొల్లపూడి, జనవరి 22 : అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు చేసిన ఒక్క మంచి పని ఏదైనా ఉంటే చెప్పాలని సీఎం జగన్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం గొల్లపూడిలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ, నా ఎస్సీ నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ జగన్ కొత్త రాగం ఎత్తుకున్నాడని, వాస్తవానికి ఆయన వారికి చేసింది శూన్యమన్నారు. ప్రజలు మౌనం వహిస్తే దుర్మార్గులు రాజ్యమేలతారన్నారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో కేశినేని శివనాథ్ (చిన్ని), నాగుల్ మీరా, వీరంకి గురుమూర్తి, వల్లూరు మధు, కన్నా వెంకటేశ్వరరావు, వాతపల్లి వెంకటేశ్వరరావు, నడకుదిటి నాగేశ్వరరావు, శేఖర్‌బాబు, సాధనాల వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం సిగ్గుచేటు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : జీతాల పెంపుదల కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సిగ్గుచేటని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. సోమవారం బందరులో ఆయన మాట్లాడుతూ, జీతాలు పెంచమంటే జైళ్లకు పంపడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నా సీఎం జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపితేనే రాష్ట్రాభివృద్ధి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తే కానీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో ఆదాయ వనరులు పెరగలేదని, ఉద్యోగాలు కల్పించలేదన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేశారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నలిగిపోతున్నారన్నారు. భూరక్షణ చట్టం అమలులోకి తీసుకురావడంతో ప్రజలు గందరగోళంలో ఉన్నారన్నారు.

బీసీల సాధికారిత టీడీపీకే సాధ్యం : వర్లకుమార్ రాజా

పామర్రు : రాష్ట్రంలో బీసీలకు సమాన న్యాయం, సాధికారిత కలిగించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కుతుందని పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక బాపూజీ పేట గౌడరామాలయం వద్ద సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుమార్‌రాజా మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి, సంక్షేమం టీడీపీకే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలన్నారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ విభాగపు కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షిద్దాం.. : ఢిల్లీరావు

కృష్ణలంక : బాలికల హక్కులను పరిరక్షించి బంగారు భవిష్యత్తును అందించడంతో పాటు లైంగిక వేధింపులను నివారించడం ప్రతి ఒక్కరి కర్తవ్య, బాధ్యత అని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న హక్కులు, చట్టాలను సమర్థవంతంగా అమలుచేసినప్పుడే వారికి బంగారు భవిష్యత్తును అందించగలుగుతామన్నారు. బాలికలపై వేధింపులు, దోపిడీ, హింస వంటి సంఘటనలను గుర్తిస్తే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వంటి ఫ్రీ నెంబర్‌లకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణోత్సవాలు

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- పులకించిన పుర వీధులు



బందరు కోనేరు సెంటర్‌లో స్వామివారి కల్యాణోత్సవం, హాజరైన భక్తులు

మచిలీపట్నం టౌన్, జనవరి 22 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ శ్రీరామ మందిరాలు, దేవాలయాల్లో అంగరంగ వైభవంగా రాములోరికి అర్చనలు నిర్వహించారు. కోనేరుసెంటర్‌లో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చిట్టి కుమారి భక్త బృందంచే కీర్తనలు గానం చేశారు. విదుషిమణి పావని, మాధవి తదితరులు భగవద్గీత పారాయణ చేశారు. సాయి మల్లయ్య భజన సమాజం ఆధ్వర్యంలో మరకాని మంగపతిరావు, తుకారాం, జంగాల వేణు, శర్మ, వెంకటేశ్వరరావులు భద్రాద్రి రామదాసు కీర్తనలు గానం చేశారు. వివిధ దేవాలయాల నుంచి కాషాయ జెండాలతో వేలాది భక్తులు కోనేరుసెంటర్‌కు ఊరేగింపుగా తరలివచ్చారు. కోనేరుసెంటర్‌లో సీతారామ కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు శ్రీరామచంద్రుని క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు పంతం వెంకట గజేంద్ర తదితరులు పాల్గొన్నారు. కళాకారులు నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఊరంతా కాషాయ రంగు నిండిపోగా రామాలయాల్లో కళ్యాణోత్సవాలు జరిపారు. అన్నప్రసాద వినియోగం జరిగింది. పందిళ్లలో పానకం పంపిణీ చేశారు.

దుర్గగుడిలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం

వన్‌టౌన్ : అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా రామాలయాలలో అభిజిత్ లగ్న సమయాన విశేష పూజాదికాలు జరిగాయి. ఈ క్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శాస్త్రోక్తంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీత, లక్ష్మణ, హనుమత్సమేత శ్రీరామచంద్రుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజాదికాలను సమర్పించారు. ముఖ్య అర్చకులు ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పంచదార, నెయ్యి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం హారతులు సమర్పించి అర్చనా మూర్తులకు వివిధ ఉపచారాలు నిర్వహించారు. ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా శ్రీరామ నామ భజన, కీర్తనలను భక్తులు ఆలపించారు.



సీత, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రుల ఉత్సవమూర్తులు, పాల్గొన్న భక్తులు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ

ప్రతి అర్జీకి తక్షణ పరిష్కారం చూపాలి

- స్పందనలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 22 : స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో 106 అర్జీలను స్వీకరించడం జరిగిందని, అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలకు ఆయా శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ జె.సునీత, హౌసింగ్ పీడీ ఎం.రజనికుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్ తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరంచారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రతి సోమవారం 10.30 గంటలకు ఠంచనుగా స్పందన కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె సూచించారు. పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తాం..

మిచౌంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని రైతులనుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని జేసీ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం జరిగింది. కుప్పలపై ఉన్న ధాన్యం నూర్పిడి చేసే విధంగా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రంగుమారిన, తడిచిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ సూచనలను పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బిల్లులను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు. జిల్లావ్యవసాయసలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, పౌసరఫరాలసంస్థ జిల్లా మేనేజరు డి.రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కనాటిన అధికారులు

కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో వాణి మొక్కలు నాటారు. కలెక్టరేట్‌లో సత్యమేవ జయతే, ప్రభుత్వ చిహ్నం ఏర్పాటుచేసే ప్రాంతం వద్ద జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా కలెక్టరేట్ సుందరీకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

చంద్రబాబు సీఎం కావాలంటూ పాదయాత్ర

గన్నవరం, జనవరి 22 : టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ నెల్లూరు జిల్లా చెందిన ఎస్సీఎస్టీ, మైనార్టీల జిల్లా అధ్యక్షుడు చింతల అశోక్‌బాబు ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకూ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర సోమవారం గన్నవరం చేరింది. వీరికి టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ, చంద్రబాబు సీఎం కావాలని తిరుపతి ఏడుకొండల స్వామిని కోరుతూ పాదయాత్ర కొనసాగిస్తున్నామన్నారు. పాదయాత్రలో చింతల మహేంద్ర, జాషువా, సిసింద్రి, చెంచలయ్య, శ్రీనాథ్, వివేక్‌లు ఉండగా స్థానిక నాయకులు బోడపాటి రవి, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, జూపల్లి సురేష్, బండారు లక్ష్మి, వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర

●అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మార్మోగిన రామనామస్మరణ
●రామాలయాల్లో ప్రత్యేక పూజలు



జంక్షన్ సెంటర్‌లో శ్రీరాముడి శోభాయాత్రలో రామభక్తులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం హనుమాన్‌జంక్షన్‌లో ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రామభక్తులు భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. వేలాది మంది రామభక్తులు ఈ యాత్రలో పాల్గొని జై శ్రీరామ్ అంటూ భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర వేలేరు అడ్డరోడ్డు వద్ద రామాలయం వరకు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు నీరాజనాలు పలికారు. దారి పొడవున వివిధ రకాల కళాకారులు కళారూపాలను ప్రదర్శించారు. శోభయాత్రలో విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, అభయాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ నెరుసు నాగభూషణం, ముముక్షు భజన సమాజం, జైహనుమాన్ భజన మండలి సభ్యులు, సత్యసాయి సేవా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేలేరులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా బాపులపాడు మండలంలోని గ్రామాలు, ఆలయాలు శ్రీరామనామ సంకీర్తనలతో మార్మోగాయి. హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి నుంచి బయలుదేరిన శోభాయాత్ర వేలేరులోని పంచముఖాంజనేయస్వామి సమేత సీతారామచంద్ర స్వామి ఆలయం వరకు మేళతాళాలమధ్య వైభవంగా నిర్వహించారు. మహిళలు కోలాట నృత్యం చేయగా, కనుమూరి చిన్నరాజు ఆధ్వర్యంలో అర్చకులు మారేపల్లి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో శ్రీరామక్రతువు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయోధ్యలో జరిగే బాలరాముని ప్రాణప్రతిష్ఠను ప్రజలు, భక్తులు వీక్షించేందుకు వీలుగా వేలేరు వద్ద గల ఆలయ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరను ప్రసాదరాజు, ఏపీఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు ఏర్పాటు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, భక్తి బృందం, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేయడంతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేలేరులోని చెన్నకేశవస్వామి ఆలయం, కానుమోలులోని శ్రీరామాలయం, రంగన్నగూడెంలోని రామాలయం, ఆరుగొలనులోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంకిపాడులో..



ప్రొద్దుటూరు గాయత్రి విహార్‌లో..

ప్రొద్దుటూరు (కంకిపాడు) : అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రొద్దుటూరు గాయత్రి విహార్‌లోని ధ్యాన యోగ సాయి మందిరంలో శ్రీరాముడికి విశేషపూజలు నిర్వహించారు. రామనామ జపం, రామరక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా, రామనామ సంకీర్తనలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వై. శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలివేంద్రపాలెం అభయాంజనేయస్వామి దేవస్థానంలో అయోధ్య రామాలయంలో గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా పూజలు

పెనమలూరు : అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని రామాలయాలు, వేణుగోపాలస్వామి ఆలయాల్లో హిందువుల ఆరాధ్య దైవం సీతారాముడికి వైభవంగా భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనమలూరు, పోరంకి, కానూరు, యనమలకుదురు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపులిపాక సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవస్థానంలో లలితా సహస్రనామాలు, హనుమాన్‌చాలీసా పారాయణం గావించారు. అట్లూరి లక్ష్మి, గుంటూరి సుందరి, భక్త బృందం ప్రదర్శించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో తాతినేని శ్రీరాం, వల్లూరు శ్రీమన్నారాయణ, వల్లూరు వెంకట రామచంద్రరావు పాల్గొన్నారు.



పెదపులిపాకలో..

ఉయ్యూరులో..



ఉయ్యూరులో రామజ్యోతితో శోభాయాత్ర

ఉయ్యూరు : రామనామస్మరణ మండలంలో వాడ వాడలా మార్మోగింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని సోమవారం మండల పరిధి గ్రామాలలోని రామాలయాలు, అంజనేయస్వామి మందిరాలు, గీతామందిరాల్లో ప్రత్యేక పూజలు చేసి రామనామస్మరణ, భక్తి గీతాలు ఆలపించి భజనలు చేశారు. ఉయ్యూరు పంచపట్టాభిరామ స్వామి ఆలయంలో పూజలు, దీపారాధన చేశారు. బాలరాముడి ప్రతిష్ఠ పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఉయ్యూరు ఖండ ఆధ్వర్యంలో రామజ్యోతులతో శోభాయాత్ర నేత్రపర్వంగా నిర్వహించారు. కొత్తవంతెన సెంటర్‌లో సువర్చల ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి వందలాది మంది మహిళలు రామ జ్యోతులతో శోభాయాత్ర నిర్వహించారు. సువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జగన్ పతనం ఖాయం



యనమలకుదురులో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాల పంపిణీలో మొక్కపాటి శ్రీనివాస్

పెనమలూరు, జనవరి 22 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాల్జేసిన సైకో జగన్‌రెడ్డి పతనం ఖాయమని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. యనమలకుదురు 51, 58బూత్‌ల పరిధిలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అధికార మదంతో తన సొంత చెల్లిని, తల్లిని కూడా వ్యతిరేకులుగా మార్చుకొన్న జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ ప్రారంభమయిందని పేర్కొన్నారు. టీడీపీ జనసేన ప్రభుత్వ ప్రభంజనం ఖాయమని తేల్చి చెప్పారు. ఆయన వెంట సయ్యద్ షాహీనా, శేఖర్, ఉమామహేశ్వరరావు, రబియా తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు, జనవరి 22 : యనమలకుదురు లంబాడీపేటకు చెందిన బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..యనమలకుదురు లంబాడీపేటకు చెందిన మహిళ, దగ్గర్లోని వాటర్ ప్లాంట్‌లో పనిచేసే తన కుమార్తె(14) ఆదివారం నుంచి కనిపించడం లేదని. ఇంట్లోని ముప్పైవేల రూపాయలు తీసుకొని వెళ్లిపోయిందంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

78 మద్యం సీసాల పట్టివేత

తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై నివాసముండే సింహాద్రి శివనాగమణి అక్రమంగా 78 మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడింది. విచారణలో తాను స్థానికంగా ఉన్న పెనమలూరు, కానూరు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని అధిక ధరలకు తెచ్చి లాభంతో రాత్రిళ్లు విక్రయిస్తున్నట్టు పోలీసులకు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు



ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పీడీ బాలకృష్ణ

ఉయ్యూరు, జనవరి 22 : కృష్ణా విశ్వవిద్యాలయం 12వ అంతర్ కళాశాలల పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల జట్టు ప్రథమ, ఆంధ్రలయోలా కళాశాల జట్టు ద్వితీయ, నున్న వికాస్ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించాయి. పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీరామ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వ్యాయామ అధ్యాపకుడు చంద్రబాబు పాల్గొని విజేతలకు అభినందనలు తెలియజేశారు.



మీతో మీ నాయకుడు కార్యక్రమంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ ప్రభుత్వ అసమర్థతతోనే

రాష్ట్రం నష్టపోయింది

●సీబీఎన్ ఫోరం కార్యక్రమంలో యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 22 : వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్న మంత్రుల చేతగాని తనం వల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం రాత్రి సీబీఎన్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన 'మీతో మీ నాయకుడు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టీడీపీని ఎన్టీఆర్ స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లో అధికారంలోకి తీసుకొచ్చి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కేవలం సినిమా హీరోగా మిగిలిపోకుండా రాజకీయాల్లోకి వచ్చి బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలను త్రికరణ శుద్ధిగా పాటించారని, పేద బడుగు బలహీన వర్గాల కోసం విశేషంగా కృషి చేశారన్నారు. అందుకే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోయాడని, తెలుగు భాషపై ఉన్న మమకారంతోనే ఆయన స్థాపించిన పార్టీకి తెలుగుదేశం అని పేరు పెట్టారన్నారు. తెలుగు ప్రజలు భూమి మీద ఎక్కడ ఉన్నా గర్వంగా నేను తెలుగు వాడినని చెప్పుకునే స్థాయిలో నిలిపారని ప్రశంసించారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సీట్లు సర్దుబాటు, పదవుల కోసంప్రాకులాడకుండా బేషరతుగా టీడీపీతో పొత్తుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుకు వచ్చారన్నారు. నారా లోకేష్ చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా ఎన్ని ఇబ్బందులు పెట్టినా పట్టు వదలకుండా ప్రజల కష్టాలను దగ్గరగా చూడాలని పాదయాత్రను కొనసాగించారన్నారు. రాబోయే కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి దశదిశ చూపించబోయే నాయకుడు లోకేష్ అన్నారు. అప్పులు చేసి సంక్షేమ పథకాలు ఇస్తే ప్రజలు హర్షించరని, దానికి బీఆర్ఎస్ ఓటమి గుణపాఠమన్నారు. హైదరాబాద్ నుంచి నియోజకవర్గ వాసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు, పరిష్కార మార్గాలను వివరించారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధనకు కృషి



గోసాల పుట్టబజారులో పర్యటిస్తున్న హక్కుల పోరాట సమితి నాయకులు

గోసాల (కంకపాడు), జనవరి 22 : ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధన కోసం తాము కృషి చేస్తున్నామని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ, కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లు, గోసాల, గంగూరు గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏలియా మాట్లాడుతూ, రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఉయ్యాల ఏడుకొండలు, కుంభ వెంకటేశ్వరరావు, గరికె దుర్గాప్రసాద్, కొడాలి నాగరాజు, సాలా నాగులు, ప్రతాప్, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, కందుల శ్రీనివాసరావు, దేవరపల్లి రాజారత్నం, వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

●మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 22 : తెలుగుదేశం పార్టీకి వెనుకబడిన వర్గాలు వెన్నెముఖ అని పార్టీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావు అధ్యక్షతన ఉయ్యూరు పట్టణ, రూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. రాజకీయంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు, ఉయ్యూరు మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచం ద్రరావు, ఖుద్దూస్, నగర సాధికార కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, గోలి వసంతకుమార్, కుటుంబరావు, జగరోతు నాగరాజు, గోపీచంద్, శివరామకృష్ణ, సీహెచ్ సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

రైతులకు అండగా రక్ష ఫౌండేషన్

ప్రొద్దుటూరు (కంకిపాడు), జనవరి 22 : ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపా రులు అక్రమ కేసులు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ రక్ష ఫౌండేషన్ చైర్మన్ పడమట సురేష్‌బాబు అన్నారు. ప్రొద్దుటూరు గ్రామ పరిధిలో ఎస్సీ, ఎస్టీ రైతులతో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ స్నిగ్ధతో కలిసి సోమవారం పర్యటించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పడమట సురేష్‌బాబు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రొద్దుటూరు పరిధిలోని 35 మంది రైతులకు సాగు చేసుకునేందుకు వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే రైతులు వ్యవసాయం చేసుకునేందుకు వీలు లేకుండా పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారుల సాయంతో రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. కోర్టులో అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సమస్యను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రక్ష ఫౌండేషన్ చైర్మన్ పడమట సురేష్ బాబు

అంగన్వాడీల అరెస్టు దుర్మార్గం

●విజయవాడ నిరసనకు వెళ్లకుండా అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు
●పోలీస్ స్టేషన్లకు తరలింపు



గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, ఉంగుటూరు పీఎస్ ఎదుట..

గన్నవరం, జనవరి 22 : తమ సమస్యలు పరిష్కారం కోసం సోమవారం ఛలో విజయవాడ చేపట్టిన అంగన్వాడీలను అరెస్టు చేసి గన్నవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులు చేయటం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలను విధుల నుంచి తొలగించటం నియంతృత్వ పాలనకు నిదర్శనమన్నారు. నాయకులు రాధాకృష్ణ, ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు, గోపి, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, జయమ్మ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సమస్యల పరిష్కారం కోసం 43 రోజులపైగా శాంతియుతంగా సమ్మె చేస్తూ తమ నిరసన తెలియజేయడానికి ఛలో విజయవాడ వెలుతున్న అంగన్వాడీలపై వైసీపీ ప్రభుత్వం పోలీసుల అండతో సోమవారం ఉక్కుపాదం మోపింది. జాతీయ రహదారిపై వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అంపాపురం వద్ద, హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బొమ్ములూరు టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఆటోలు, బస్సులలో విజయవాడ వెలుతున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాడేరు, అనకాపల్లి, ఉభయగోదావరి, తదితర ప్రాంతాల నుంచి వస్తున్న 70మందికి పైగా అంగన్వాడీలను అదుపులోకి తీసుకుని వీరవల్లి, ఆత్కూరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఉంగుటూరు : పొట్టిపాడు టోల్‌గేట్‌వద్ద సోమవారం తెల్లవారుఝామున ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. తుని, రాజమండ్రి, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వాహనాల్లో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను అరెస్ట్‌చేసి పీఎస్‌కు తరలించారు. అలాగే విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో నుంచి ధర్నాచౌక్ వైపు వెళ్తున్న విజయవాడ సిటీ, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాలకు చెందిన అంగన్వాడీలతోపాటు సీఐటీయూ నేతలు ఎన్.సీహెచ్.శ్రీనివాస్, బేతా శ్రీనివాసరావును అరెస్టు చేసి ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన అంగన్వాడీలు పీఎస్ ఎదుట బైఠాయించి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. అంగన్వాడీలకు ప్రజాసంఘాల నాయకులు టీవీ లక్ష్మణస్వామి, కడవకొల్లు రామరాజు, అజ్మీర్ వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

కంకిపాడు : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కంకిపాడు మండలంతో పాటు ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాలకు చెందిన అంగన్వాడీలను కంకిపాడులో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుస్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా అంగన్వాడీలు మేమేం తప్పు చేశాం, పోలీసుస్టేషన్‌కు ఎందుకు రావాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

అదే క్రమంలో పెడన మండలం నుంచి ఆటోలో వస్తున్న వ్యవసాయ కూలీలను పోలీసులు కంకిపాడులో అడ్డుకున్నారు. తాము వ్యవసాయ కూలీలమంటూ పోలీసులతో వాగ్వా దానికి దిగారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

అవనిగడ్డ బార్ న్యాయవాదుల నిరసన



అవనిగడ్డ : ల్యాండ్ టైటలింగ్ యాక్టును రద్దు చేయాలని అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టుకు నిరసనగా బార్ అసోసియేషన్ సభ్యులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సనకా రఘురామ ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ నాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, అందె శ్రీరామమూర్తి, వేణుగోపాలరావు, తూటారం ప్రసాద్, రామకృష్ణ, శేషగిరి, సభ్యులు పాల్గొన్నారు.



స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కొల్లు రవీంద్ర దంపతులు



బంటుమిల్లిలో జైశ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర



పెడనలో..



కోడూరులో...



పెదముత్తేవిలో..

అంతా రామమయం

• వాడవాడలా సీతారాముల కల్యాణం • వైభవంగా శోభాయాత్ర • మార్మోగిన రామనామం

మచిలీపట్నం, జనవరి 22 : అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నగరంతో పాటు గ్రామాల్లోనూ రామనామం మార్మోగింది. బందరులో శోభాయాత్ర ఘనంగా జరిగింది. మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో సోమవారం జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, కొల్లు నీలిమ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. **అవనిగడ్డ :** లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఆధ్వర్యంలో హరేరామ సంకీర్తనలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అర్చకులు డివి.రామాచార్యులు, అప్పాలాచార్యులు, నరసిం హమూర్తి తీర్థ ప్రసాదాలను అందించారు. **అవనిగడ్డ రూరల్ :** మోదుమూడిలోశ్రీరాముని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. మూడు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. **ఘంటసాల :** అక్కమ్మ వారి రామాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. చిట్టూర్పు జోడుగూడెంకు చెందిన మహిళా భక్తబృందం తాళం భజన, బోళ్లపాడు భక్త బృందం కోలాటం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. దేవరకోట కోదండ రామాలయంలో బృందావనం సీతారామాచర్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. యండకుదురు, శ్రీకాకుళం, కొడాలి, చిట్టూర్పు తదితర గ్రామాల్లోని రామాలయంలో పూజలు నిర్వహించారు. **చల్లపల్లి :** చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ సమయాన స్వామివారికి కర్పూర హారతి, శంఖానాదం, ఘంటానాదం జరిగింది. వైస్ ఎంపీపీ మోర్ల రాం బాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారాకానాథ్, చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, జల్లూరి ప్రసాద్, కొల్లిపర మధు, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, తమ్మన సతీష్‌కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సంతబజారు సెంటరులో రోశయ్య క్లాత్ షోరూం వద్ద ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఉపసర్పంచ్ నాని ప్రారంభించారు. **కూచిపూడి :** పెదముత్తేవిలో సీతారామ, లక్ష్మణ హనుమాన్ విగ్రహాలతో శోభాయాత్ర రమణీయంగా సాగింది. చినముత్తేవి, పెదపూడి, కూచిపూడి, మొవ్వ, కోసూరు, కాజ, కారకంపాడు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో విశేష పూజలు, దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. అన్నసమారాధన చేశారు. **గుడ్లవల్లేరు :** వార్పురోడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ సంకీర్తనలు నిర్విరామంగా ఆలపించారు. పాల శీతల కేంద్రం వద్ద జై శ్రీరామ్ జెండాను ఆవిష్కరించారు. బాలరాముని చిత్రపటానికి పూజలు చేశారు. తూర్పు వైపు చెరువుగట్టు రామాలయం, వడ్లమన్నాడులో ప్రత్యేక పూజలు జరిపారు. వల్లభనేని వెంకటరావు, అట్లూరి దిలీప్ కుమార్, డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, కోలా రాధాకృష్ణ, సింగంశెట్టి ఆదినారాయణ, వేణునాయక్, అగ్నిహోత్రం ఫణిగోపాల్, రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకటరావు, బొప్పన శ్రీనివాస్, మూల్పూరి సుధాకర్‌లు పాల్గొన్నారు. **నాగాయలంక :** శ్రీరామపాదక్షేత్రంలో భక్తులు దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో అమ్మవారికి, ఆంజనేయస్వామి వారికి పూజలు చేశారు. శ్రీరాముని, అమ్మవారి చిత్రపటాలను పురవీధులలో ఊరేగిస్తూ శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు, ప్రజలు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిట్టా సాంబశివరావు, మండవ బాలవర్ధిరావు, చిట్టా అన్నపూర్ణయ్య, శేఖర్, శివనాగేశ్వరరావు, కోలా భిక్షం, చిట్టా బాలపాపారావు తదితరులు పాల్గొన్నారు. కొతవరం షిర్డీసాయి మందిరంలో సహస్ర దీపార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన చేశారు. ఆలయ ఛైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్ (బాలు), డైరెక్టర్‌లు పాల్గొన్నారు. **పామర్రు :** జైశ్రీరామ్ నామం మండలంలో మార్మోగింది. పామర్రు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. రాములవారి జెండాలతో బైకుల ర్యాలీ జరిపారు. పాఠశాలల్లో చిన్నారులు రాములవారి వేషధారణతో అలరించారు. **మోపిదేవి :** అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ రామాలయాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదప్రోలు, వెంకటాపురం, పెదకళ్లేపల్లి, నాగాయితిప్ప, మోపిదేవివార్పు రామాలయాల వద్ద కల్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కోసూరువారిపాలెం అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద శేఖర్ బాబు మిత్ర బృందం ఆధ్వర్యంలో పానకం, పులిహోర, లడ్డూ ప్రసాదం భక్తులకు అందజేశారు. కోసూరు రవి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **నందివాడ :** మండలంలోని నందివాడ, జనార్ధనపురం, తుమ్మలపల్లి, కుదరవల్లి, లక్ష్మీనరసింహాపురం, పొలుకొండ, గొంగళ్లమూడి, తమిరిశ పలు గ్రామాల్లో శ్రీరాముని దేవాలయాల్లో పూజలు నిర్వహించి పురవీధులలో జైశ్రీరామ్ అంటూ ర్యాలీ నిర్వహించారు. **పెడన :** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా హిందూ బంధువుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శోభాయాత్ర యాత్ర నిర్వహించారు. భక్తులకు పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. **బంటుమిల్లి :** అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రామాలయ, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాశ్చాపురం సువర్చాల సమేత ఆంజనేయ స్వామి ఆలయం నుంచి భజనలు చేస్తూ పాశ్చాపురం రామాలయం, మల్లేశ్వరం, బంటుమిల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, సంతమార్కెట్ రామాలయం, బస్టాండ్ సమీపాన గల రామాలయం వరకు శోభాయాత్ర జరిగింది. **కోడూరు :** అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కోడూరులో రామభక్తులు శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితులు మూట్పూరి సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీధరాచార్యులు, కాశీభొట్ల సాయి మిత్ర బృందం కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తిగీతాలు, మురళీ కోలాటాలు, జై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. స్వతంత్రపురం, నరసిం హాపురం, రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిగింది. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. **గుడివాడ :** బంటుమిల్లి రోడ్డులో కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ వైభవాన్ని ఘనంగా నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలతో పట్టణం హోరెత్తింది. జైన్ మతస్తులు జైశ్రీరామ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించగా, మహిళలు కలశాలతో రామనామం జపిస్తూ ఊరేగింపు జరిపారు. **గుడివాడ రూరల్ :** అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామగ్రామాన రామనామం మార్మోగింది. పర్నాస లో జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. వందలాది మందికి అన్నసమారాధన జరిపారు. **పమిడిముక్కల :** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో పూజలు జరిపి, శోభాయాత్ర నిర్వహించారు.



మోదుమూడిలో శోభాయాత్ర



ఘంటసాల రామాలయంలో..



చల్లపల్లిలో..



గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం వద్ద..



నాగాయలంకలో..



శ్రీరాముడిగా చిన్నారి



పీహెచ్‌సీ, సచివాలయ భవనాల ప్రారంభం

పెదపారుపూడి : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. పెదపారుపూడిలో రూ1.80 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని సోమవారం కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలసి ప్రారంభించారు. డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ చప్పిడి సమీరా, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయండి

మోపిదేవి : ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని మరింత వేగవంతం చేయాల్సిందిగా రాష్ట్ర నోడల్ అధికారిణి ఆర్.చిత్ర ఆదేశించారు. సోమవారం ఆమె మోపిదేవిలో పర్యటించి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో వ్యయ పరిమితిని పెంచి డిజిటల్ కార్డులను ప్రవేశ పెట్టిందన్నారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ అనిల్, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో బాబు రావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల అరెస్టు

• పోలీస్ స్టేషన్ల వద్ద నిరసన
• టీడీపీ, జనసేన సంఘీభావం
• ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు

పామర్రు : అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ నేత గంగాధర్ ప్రసాద్‌ను ఆదివారం అర్థరాత్రి పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకుని పామర్రు స్టేషన్‌కు తరలించారు. హక్కులను హరిస్తూ నిర్బంధించడాన్ని గంగాధరావు ఖండించారు. **చల్లపల్లి :** బాపట్ల జిల్లా రేపల్లె మండలానికి చెందిన 15 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు కరకట్ట మీదుగా విజయవాడ వెళుతుండగా శ్రీకాకుళం వద్ద పోలీసులు అడ్డగించి చల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చల్లపల్లి మండలానికి చెందిన మరో ఐదుగురు కార్యకర్తలను సైతం స్టేషన్‌కు తీసుకువచ్చారు. **మోపిదేవి :** అంగన్‌వాడీ ఉద్యోగులపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్య వీడనాడాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు సోమవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఛలో విజయవాడకు బయలుదేరగా, కోనసీమ జిల్లా రాజోలు సెక్టార్ నుంచి విజయవాడ వెళ్తున్న ఉద్యోగులను మోపిదేవి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలను తెలుగుదేశం, జనసేన, సీఐటీయూ నాయకులు కలసి సంఘీభావం తెలిపారు. మోపిదేవి పోలీస్ స్టేషన్ ముందు నినాదాలు చేస్తూ హోరెత్తించారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రావి రత్నగిరి, జనసేన అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు గుడివాక శేషుబాబు, ఆయా పార్టీల నాయకులు దిడ్ల జానకి రాంబాబు, పూషడపు రత్నగోపాల్, కొమ్ము పవన్ కుమార్, చందన రంగారావు తదితరులు ఉన్నారు.

అవనిగడ్డ : రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలకు మండలి వెంకట్రామ్ సంఘీభావం తెలిపారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జనసేన పార్టీ నేత గుడివాక శేషుబాబు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై న్యాయవాది, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు నిరసన వ్యక్తం చేశారు.

పెడన : అంగన్వాడీల నిరసనతో గూడూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు రెజీనారాణిని గూడూరు పోలీసులు ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రి 11 గంటల తర్వాత ఆమెను స్టేషన్ నుంచి తీసుకువెళ్లి ఇంటి దగ్గర వదిలారు. అంగన్వాడీ కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జనసేన నాయకుడు సమ్మెట బాబు సంఘీబావం తెలిపారు. **కోడూరు :** అంగన్వాడీలను అరెస్టు చేయటం దుర్మార్గమని మండల రైతు సంఘం నాయకుడు ఆవుల బసవయ్య అన్నారు. ప్రభుత్వం తమ వైఖరి తక్షణమే మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మండల రైతు సంఘం నాయకులు రేపల్లె యోగ ప్రకాష్, చెక్క వెంకటేశ్వరరావు, బత్తిన రాజగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : అంగన్వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి ఆయా స్టేషన్‌లకు తరలించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ బయట అంగన్వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు. **పమిడిముక్కల :** అంగన్వాడీ వర్కర్లను పోలీసులు మంటాడలో అరెస్టు చేసి పమిడిముక్కల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు, చోరగుడి సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, పమిడిముక్కల సర్పంచ్ ముళ్లపూడి సునీత, టీడీపీ నాయకులు జక్కాశ్రీనివాసరావు, కందిమళ్ల సుబ్రమణ్యం, కె శివనాగేంద్రం, కాగిత గోపాలకృష్ణ సంఘీభావం ప్రకటించారు.



పామర్రు పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీల నిరసన



మోపిదేవిలో పోలీస్ స్టేషన్ వద్ద...



చల్లపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద...

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపండి : వెనిగండ్ల, మండలి, రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం పెదపట్నం, జి పెదపట్నం, కోన తదితర గ్రామాల్లో కొల్లు రవీంద్రతో పాటు రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ నాయకులు లంకే శేషగిరి, మీనవల్లి నాగేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్, గడిదేసి ప్రభాకర్, సంధ్య, రవి, ఏసుబాబు, తలారి రాంబాబు, గుమ్మడి విద్యాసాగర్, అయ్యప్ప, రాయన శివ విస్తృతంగా పర్యటించారు. టీడీపీలో చేరిన యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. **గుడివాడ :** వైసీపీ ప్రభుత్వంలో గుడివాడలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడివాడలోని 5, 6 వార్డుల్లో వెనిగండ్ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలు వెనిగండ్లకు హారతి ఇచ్చారు. ఆయా వార్డుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధి చెందాలంటే వెనిగండ్ల రామును గెలిపించాలన్నారు. ౧ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ టీడీపీ,జనసేన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పొట్లూరి శ్రీవెంకటేశ్వరరావు, బుజ్జి, చింతల ప్రసాద్, గురువుల వినోద్‌కుమార్, సాయికృష్ణ, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లగా రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తే, జగన్ హయాంలో ఉన్న పరిశ్రమలను కూడా బయటకు తరిమికొట్టి యువతను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. టీడీపీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, పరిశె చలపతి తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం టౌన్ : టీడీపీ పాలనలోనే మురికివాడల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు అన్నారు. సోమవారం రాత్రి 29వ డివిజన్ అమృతపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను వివరించారు. టీడీపీ నాయకులు తిరుమాని నారాయణ, ఖాజా, దేవ మనోహర్, దేవరపల్లి అనిత, పాలపర్తి పద్మజ, మెట్టు సూరిబాబు, మోపిదేవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. పెడన రూరల్ : కొంకేపూడి ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు శలపాటి ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహనరావు, జనసేన, టీడీపీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్ర బాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అర్చక స్వామి ప్రకాష్ భట్టార్ మృతి

అవనిగడ్డ : లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం అర్చక స్వామి, సీనియర్ ఫొటోగ్రాఫర్ బృందావనం ప్రకాష్ భట్టాచార్య (భట్టార్) (68) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. భట్టాచార్య మృతి పట్ల ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులతోపాటు, శ్రీవైఖానస సంఘ సభ్యులు డి.వి.రామాచార్యులు, అప్పలాచార్యులు, డివి.కె.సత్యప్రసాద్, ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

మెగా జాబ్‌మేళా 25న

గుడివాడ : వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య తెలిపారు. 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, వివరాలకు నెం.79819 36844, 98488 19682లో సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక అంశాలపై అవగాహన

పెడన రూరల్ : విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆంధ్రా మెడికల్ టెక్‌జోన్ (వైజాగ్) ప్రతినిధి డి. ఎన్.నరేష్ కుమార్ అన్నారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థులకు బయోమెడికల్ టెస్టింగ్, 3డి ప్రింటింగ్, లేజర్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, కరస్పాండెంట్ కుమార్ బాబు, దోసపాటి బాబా, పి.శ్రీకాంత్, డి.శ్రీధర్, శివాజి పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

పెడన : కడుపునొప్పి తాళలేక మండలంలోని సింగరాయపాలెంలో శలపాటి అమలేశ్వరరావు (45) జీడిమామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శశికిరణ్ ఫిర్యాదు మేరకు ఎస్సై-2 హనుమంతరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయహో బీసీ సభ నేడు

పెడన : పెడన పట్టణ జయహో బీసీ సభ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బ్రహ్మపురం దేవాంగ కల్యాణ మండపంలో జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్ తెలిపారు. ఈ సభలో కొనకళ్ళ నారాయణరావు, కాగిత కృష్ణప్రసాద్, గురుమూర్తి పాల్గొంటారన్నారు.

లలితా శేఖర్ దంపతులకు అభినందన



బంటుమిల్లి : జిల్లా ఆర్య వైశ్య సంఘం లీగల్ సెల్ ఛైర్మన్‌గా హైకోర్టు న్యాయవాది కొల్లా లలితా శేఖర్ నియమితులయ్యారు. కొల్లా లలితా శేఖర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా, శ్రీరామమందిర ఛైర్మన్‌గా సేవలందించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, రామాలయ కమిటీ సభ్యులు లలితా శేఖర్ దం పతులను అభినందించారు.